సాక్షి అనంతపురం

బుధవారం । 7 । ఆగస్టు । 2024



చీనీ టన్ను రూ.19,200

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19,200 పలికాయి.



టమాట కిలో రూ.25

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.25 పలికింది. కనిష్టం రూ.16, సరాసరి రూ.21 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/ 24.8°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు చేరుకున్న కృష్ణా జలాలు



కసాపురం వద్ద హంద్రీనీవా కాలువలో పారుతున్న కృష్ణాజలాలు

గుంతకల్లు రూరల్: కృష్ణా జలాలు జిల్లాకు చేరుకున్నాయి. మూడు రోజుల క్రితం నంద్యాల జిల్లాలోని మాల్యాల వద్ద ఎత్తిపోతల ద్వారా హంద్రీనీవా కాలువకు జలాలను వదిలారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయానికి జిల్లా సరిహద్దులో 144 కిలోమీటర్ వద్ద ఉన్న గుంతకల్లు మండలంలోని కసాపురం గ్రామం వద్దకు కృష్ణా జలాలు చేరుకున్నాయి.

సెప్టెంబర్ 1 నుంచి పశుగణన

అనంతపురం అగ్రికల్చర్: సెప్టెంబర్ ఒకటి నుంచి పశుగణన కార్యక్రమం మొదలవుతుందని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ వెళ్లి పశువులు, గేదెలు, జీవాలు, ఇతరత్రా అన్ని రకాల మూగజీవాలు, జంతువుల వివరాలు పక్కాగా సేకరిస్తామన్నారు. అందు కోసం ప్రత్యేకంగా యాప్ అందుబాటులోకి వచ్చిందన్నారు. సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ ఆఖరు వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇందుకోసం 189 మంది ఎన్యుమరేటర్లు, 53 మంది సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు. ఎంపికైన వారికి ఈనెల 7, 8 తేదీల్లో శిక్షణ ఇస్తామన్నారు. పశుగణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

టీబీ డ్యాంలో 102 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్: ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగునీరు అందిస్తున్న కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో 102.335 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రానికి 84,696 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. 12 క్రస్ట్ గేట్లు రెండు అడుగులు ఎత్తి నదికి, కాలువలకు కలిపి మొత్తం 55,227 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మరోవైపు, హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,300 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

జీతాలందక చిరుద్యోగుల అష్టకష్టాలు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, మినిమం, కాంట్రాక్టు స్కేలు ఉద్యోగుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తామని ఆర్భాటంగా పేర్కొన్న కూటమి ప్రభుత్వం రెండు నెలల నుంచి వారికి జీతాలు అందించలేదు. దీంతో చిరుద్యోగులు అష్టకష్టాలు పడుతున్నారు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవుట్‌సోర్సింగ్, మినిమం స్కేలు ఉద్యోగులకు చాలీచాలని జీతాలు అందుతున్నాయి. అవీ నేడు రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఓటాస్ అకౌంట్‌లో పేర్కొన్న బ్లాక్ గ్రాంట్ నిధులను వర్సిటీకి జమ చేయడంలో తాత్సారం చేస్తున్నారని వాపోతున్నారు. ఫలితంగా జీతాలు రాని పరిస్థితి ఏర్పడింది. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో మొత్తం 600 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రతి నెలా రూ. 6 కోట్లు వేతనాల రూపంలో చెల్లించాల్సి ఉంది.

'తమ్ముళ్ల' రచ్చరచ్చ

శింగనమల: శింగనమలలో తెలుగు తమ్ముళ్లు రచ్చ రచ్చ చేశారు. మంగళవారం స్థానిక రామాలయంలో టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. శింగనమలలో ఫీల్డ్ అసిస్టెంటు, యానిమేటర్లు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో వంట ఏజెన్సీలు, స్వీపరు, నైట్ వాచ్‌మెన్ కేజీబీవీలో స్వీపర్లు, వాచ్‌మెన్, సీహెచ్‌సీలో స్వీపర్లు, వాచ్‌మేన్ పోస్టుల పంపకాల కోసం అందరూ ఒక చోటకు చేరారు. ఈ క్రమంలో ఆయా పోస్టులు తమకంటే తమకంటూ వాదులాడుకున్నారు. ఎమ్మెల్యే వర్గం, దండు శ్రీనివాసులు వర్గం, ఎంఎస్ రాజు వర్గాలుగా విడిపోయి రచ్చ రచ్చ చేశారు. నువ్వెంతంటే నువ్వెంతంటూ రెచ్చిపోయారు. వీరిని చూసిన జనం నవ్వుకోగా, అక్కడే ఉన్న టీడీపీకి చెందిన సీనియర్ నాయకులు విస్తుపోయారు.

పేదలపై ప్రైవేటు పిడుగు!

- ప్రజారోగ్య సేవలను ప్రైవేటుకు అప్పగించే కుట్ర
- ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలతో బహిర్గతం
- గతంలో టీడీపీ పాలనలో 'పీపీపీ' పేరిట లూటీ
- రక్త పరీక్షల మాటున మెడాల్ సంస్థకు రూ. కోట్లు దోచిపెట్టిన వైనం
- గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే పేదలకు మెరుగైన సేవలు
- కూటమి సర్కారు చర్యలతో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లోనూ ఆందోళన
- ఉద్యోగాలకు ఎక్కడ ఎసరు పెడతారోనని భయం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: పేద రోగులపై మళ్లీ పిడుగు పడనున్నట్టు తెలుస్తోంది. గడిచిన ఐదేళ్లు ప్రాథమిక ఆరోగ్యానికి పెద్దపీట వేయడమే కాదు, పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని అందించింది. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకమునుపే నిధులు లేవని, హైబ్రిడ్ పద్ధతిలో వైద్యానికి వెళతామని, పీపీపీ మోడ్‌లో వెళతామని చెబుతుండడంతో మళ్లీ 2014–19 రోజులు గుర్తుకొస్తున్నాయి. గతంలో మెడాల్, టీబీఎస్, ఈ–వైద్య వంటి సంస్థలన్నీ పీపీపీ పద్ధతిలో కాంట్రాక్టులు దక్కించుకుని కోట్లాది రూపాయలు దోచుకున్న తీరు ఇప్పటికీ రోగులకు గుర్తుంది. తాజాగా కూటమి ప్రభుత్వ తీరుతో ఆస్పత్రుల్లో పనిచేసే ఉద్యోగులూ ఆందోళన చెందుతున్నారు.

బలం చేకూరుస్తున్న మంత్రి వ్యాఖ్యలు

వారం రోజుల క్రితం అనంతపురం సర్వజనాసుపత్రి తనిఖీకి వచ్చిన మంత్రి సత్యకుమార్ ప్రైవేటుకు వెళ్లే విషయాన్ని చెప్పకనే చెప్పేశారు. డబ్బులు లేవు, వైద్యసేవలు అందాలంటే ఎవరైనా దాతలు ముందుకు రావాలి, నిధులు ఇవ్వాలి అంటూ వ్యాఖ్యానించారు. హైబ్రిడ్ విధానంలో ముందుకు వెళతామని రెండు రోజుల క్రితం మళ్లీ ఆయనే తెలిపారు. గతంలో బీజేపీకి చెందిన కామినేని శ్రీనివాస్ ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలన్నీ ప్రైవేటుకు అప్పజెప్పి ఖజానా లూటీ చేశారు. ఇప్పుడు కూడా బీజేపీకే చెందిన సత్యకుమార్ అదే కోవలో వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలోనే మోసానికి బీజం..

మెడాల్ సంస్థకు రక్త పరీక్షల నిర్వహణ ఇవ్వాలనేది పక్కా పథకం ప్రకారమే జరిగింది. 2015లో జీఓ నం 17 ద్వారా ముందుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ సంస్థకు ఔట్‌సోర్సింగ్ కింద రక్త పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత ఐదుగురు సభ్యులతో కమిటీ వేశారు. కమిటీ కూడా ఈ సంస్థకే ప్రాజెక్టు ఇవ్వాలని చెప్పడంతో పనులు ఆగమేఘాల మీద జరిగిపోయాయి. అంతేకాదు 2016 జనవరి 1 నుంచి ప్రైవేటు సేవలు ప్రారంభిస్తామన్న సర్కారు, జీఓ నం. 633 ద్వారా 2015 అక్టోబర్ 14 నుంచే ప్రారంభించి పేదలకు తీరని నష్టం కలిగించింది.

టెండర్ల దశలోనే అవినీతి

ఆస్పత్రుల్లో రక్త పరీక్షల నిర్వహణకు సంబంధించి 2015 అక్టోబర్‌లో టెండర్లు నిర్వహించారు. అది కూడా ఆఫ్‌లైన్‌లో. ఇందులో ఐదారు కంపెనీలు పాల్గొన్నాయి. మొత్తం 15 రకాల రక్తపరీక్షలు నిర్వహించేందుకు ఒక్కొక్కరు ఒక్కో రేటు చొప్పున టెండర్ వేశారు. ఇందులో ఓ సంస్థ అతి తక్కువగా రూ.148కి వేయగా, ఆ కంపెనీకి సరైన డాక్యుమెంట్లు లేవని తిరస్కరించారు. అన్ని కంపెనీలను కాదని ఒక్కో టెస్టుకు రూ.235కు వేసిన మెడాల్ సంస్థకు కట్టబెట్టారు.

ఐదేళ్లూ అద్భుతంగా నిర్వహణ

గడిచిన ఐదేళ్లలో అన్నిరకాల రక్తపరీక్షలూ తక్కువ వ్యయంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేలా లేబొరేటరీలు నిర్వహించారు. ప్రైవేటు సంస్థల గుప్పిట్లో ఉన్న అర్బన్ హెల్త్ కేంద్రాలకు విముక్తి కల్పించి ప్రభుత్వమే నిర్వహించింది. దీంతో ఏటా రూ. 150 కోట్ల మేరకు వ్యయం తగ్గింది. గతంలో టీడీపీ హయాంలో పీహెచ్‌సీకి ఒక్కరే డాక్టరు ఉండగా, వైఎస్సార్ సీపీ హయాంలో ఆ సంఖ్యను ఇద్దరికి పెంచారు. అంబులెన్స్ మండలానికి ఒకటే ఉంటే రెండు కేటాయించారు. కేరళ, తమిళనాడుకు దీటుగా ప్రజా వైద్యాన్ని పునరుద్ధరించగా, ఇప్పుడేమో నిధులు లేవన్న సాకుతో ప్రైవేటుకు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతోంది. ఇదే జరిగితే కొత్తగా ఎవరికీ ఉద్యోగాలు కూడా వచ్చే పరిస్థితి లేదని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి ప్రత్యేక రైలు

గుంతకల్లు: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని కర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు గుంతకల్లు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం మనోజ్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం (నేటి) నుంచి సెప్టెంబర్ 30 వరకూ గుంతకల్లు–రాయచూరు మధ్య స్పెషల్ ప్యాసింజర్ రైలు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 5.30 గంటలకు గుంతకల్లు జంక్షన్ నుంచి రైలు బయలుదేరుతుందన్నారు. ఆదోని రైల్వేస్టేషన్‌కు 6.48 గంటలకు, కుప్పగల్ స్టేషన్‌కు (ఉరకుంద గ్రామానికి సమీప స్టేషన్) 7.08 గంటలకు చేరుకుంటుందన్నారు. అక్కడ నుంచి రాయచూర్ జంక్షన్ వెళ్లి తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరుతుందన్నారు. కుప్పగల్‌కు సాయంత్రం 4.34 గంటలకు, ఆదోని రైల్వేస్టేషన్‌కు 4.55 గంటలకు, గుంతకల్లు జంక్షన్‌కు సాయంత్రం 6.40 గంటలకు చేరుతుందన్నారు.

నేడు గూళ్యపాళ్యం మీదుగా హిందూపురం ప్యాసింజర్

గుంతకల్లు–హిందూపురం (07693/94) మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను బుధవారం గూళ్యపాళ్యం మీదుగా మళ్లించినట్లు సీనియర్ డీసీఎం తెలిపారు. గుత్తి జంక్షన్ సమీపంలో పనుల దృష్ట్యా ఒక్క రోజు ఆ మార్గంలో ప్రయాణిస్తాయన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం నుంచి యథావిధిగా గుత్తి మీదుగా రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 5 రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 32.6– 34.8, రాత్రి ఉష్ణోగ్రతలు 24.0 25.0 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 70–73 శాతం, మధ్యాహ్నం 50–53 శాతంగా నమోదవుతాయన్నారు.

కదం తొక్కిన విద్యార్థులు

- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో భారీ ధర్నా



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన విద్యార్థులు

అనంతపురం అర్బన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు కదం తొక్కారు. ఏఐఎస్‌ఎఫ్ (అఖిల భారత విద్యార్థి సమాఖ్య) ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. వివిధ మార్గాల్లో వందల సంఖ్యలో విద్యార్థులు కలెక్టరేట్‌కు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. సమస్యలు పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుళ్లాయిస్వామి, జిల్లా అధ్యక్షుడు రమణయ్య, కోశాధికారి హనుమంతు మాట్లాడారు. విద్యార్థులకు పెద్దపీట వేస్తామంటూ చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... తక్షణమే ఆ దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో 70 శాతం గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వాటి మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం నిధులు మంజూరు చేయాలన్నారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలన్నారు. వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న వార్డెన్, వంటమనిషి, అటెండర్, కామాటి పోస్టులను భర్తీ చేయాలన్నారు. వసతి గృహాల్లోని ట్యూటర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. కేజీబీవీ, గురుకులాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేసి తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు నరసింహయాదవ్, వంశీ, వెంకటే నాయక్, ఆంజనేయులు, మంజునాథ్, ఉమామహేశ్, వినోద్, చందు, నవీన్, సిద్ధూ, నగర నాయకులు సమీర్, ఆనంద్, హర్ష, నాని, పవన్, తారక్, తదితరులు పాల్గొన్నారు.

లెసన్ ప్లాన్ ప్రతి రోజూ ఉండాల్సిందే

- ఎంఈఓలు, డీవైఈఓలు మనసు పెట్టి పనిచేయాలి
- రెండుమూడు రోజుల్లో టీచర్ల సర్దుబాటుపై స్పష్టత
- పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్



మాట్లాడుతున్న పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్

అనంతపురం ఎడ్యుకేషన్: లెసన్ ప్లాన్ ప్రతి రోజూ ఉండాల్సిందేనని పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ స్పష్టం చేశారు. మండల విద్యాశాఖ అధికారులు, డిప్యూటీ డీఈఓలు మనసు పెట్టి పని చేయాలని సూచించారు. మంగళవారం స్థానిక పంగల్‌రోడ్డు సమీపంలోని ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ స్కూలులో ఉమ్మడి జిల్లాలోని డిప్యూటీ డీఈఓలు, మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ విద్యాశాఖలో ఎంఈఓలు, డీవైఈఓలు ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. వారి పరిధిలోని అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్గి ఉండాలన్నారు. ప్రతిఫోనూ లిఫ్ట్ చేసి మాట్లాడాలన్నారు. స్టూడెంట్ కిట్లను పరిశీలించాలన్నారు. షూ సైజుల్లో తేడా ఉండకూడదన్నారు. ఒకటికి రెండుసార్లు పరిశీలించి కరెక్ట్ సైజు షూలే ఇవ్వాలన్నారు. ప్రతి పాఠశాలలోనూ లెసన్ ప్లాన్ రోజూ ఉండాలని, అందులో టీచరుతో పాటు హెచ్‌ఎం సంతకం కచ్చితంగా ఉండాలన్నారు. రానున్న రోజుల్లో టీచర్ల సర్దుబాటు ఉంటుందని, రెండు మూడురోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిబంధనల మేరకే చేయాలన్నారు. ఈ విషయంలో డీవైఈఓలు, ఎంఈఓలదే బాధ్యత అన్నారు. ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. పదో తరగతి ఫలితాలు ముఖ్యం కాదని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఈఓ వరలక్ష్మి, ఏపీసీ నాగరాజు, డీవైఈఓలు పాల్గొన్నారు.

భర్తను హతమార్చిన భార్య

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం
- రాళ్లతో కొట్టి చంపిన వైనం
- గుంతకల్లు మండలంలో దారుణం



మృతుడు సేవ్యానాయక్

గుంతకల్లు రూరల్: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న అక్కసుతో కట్టుకున్న భర్తనే హతమార్చిన ఘటన గుంతకల్లు మండలంలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం గుండాల తండాకు చెందిన సేవ్యానాయక్ (45), లలితమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. తమకున్న మూడెకరాల పొలంలో వ్యవసాయంతో పాటు కూలి పనులు, బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొంత కాలంగా లలితమ్మ అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నట్లుగా గుర్తించిన సేవ్యానాయక్ పలుమార్లు ఆమెను మందలించాడు. దీంతో తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయాన్నే కూలి పనుల నుంచి తిరిగొచ్చిన లలితమ్మ మధ్యాహ్నం తమ పొలం వద్దకెళ్లింది. కాసేపటి తర్వాత కూలి పనుల నుంచి ఇంటికి చేరుకున్న సేవ్యానాయక్... తన భార్య పొలానికి వెళ్లిన విషయం తెలుసుకుని ఆమెకు సద్ది తీసుకుని బయలుదేరాడు. సాయంత్రం రక్తపు మరకలున్న బట్టలతో ఒంటరిగా ఇంటికి చేరుకున్న లలితమ్మ... స్నానం చేసి ఆ దుస్తులను ఉతికి ఆరవేసింది. రాత్రి 10.30 గంటలైనా సేవ్యానాయక్ ఇంటికి రాకపోవడంతో పిల్లలు, ఇంటి పక్కనే ఉన్న సేవ్యానాయక్ అన్నదమ్ములు ఆందోళనకు గురయ్యారు. విషయంపై లలితమ్మను గట్టిగా నిలదీయడంతో తానే రాళ్లతో కొట్టి సేవ్యానాయక్‌ను హతమార్చినట్లు ఆమె తెలపడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు గుండాల తండాకు చేరుకుని లలితమ్మను విచారించారు. అనంతరం ఆమెను వెంటబెట్టుకుని రాత్రి 11.30 గంటలకు పొలం వద్దకెళ్లి సేవ్యానాయక్ మృతదేహాన్ని గుర్తించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్లు రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి, ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

ఇసుక మార్గం .. ఇష్టారాజ్యం

- పగలు డంప్.. రాత్రికి జంప్
- వేదావతి హగరి నదిలో ఆగని అక్రమ తవ్వకాలు
- అడ్డుకుంటే అంతుచూస్తామంటూ ప్రజలకు బెదిరింపులు
- టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే దోపిడీ



డీ హీరేహాళ్ మండలం యాపిల్ ఫ్యాక్టరీ వెనుక పొదల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక



ఉద్దేహాళ్ సమీపంలో హగరి నదిలో ఇసుక తవ్వుతున్న దృశ్యం

రాయదుర్గం: జిల్లాలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. రాయదుర్గం నియోజకవర్గంలో మాఫియా ఆటలు మరీ ఎక్కువయ్యాయి. ఉచిత ఇసుక మాటున దోపిడీ పర్వానికి తెరతీశారు. ప్రభుత్వం అధికారికంగా రీచ్ తెరిచినా అక్కడ తమకేంటి పని అన్నట్లు కొందరు వేదావతిని ఊడ్చే పనిలో పడ్డారు. కణేకల్లు మండలంలోని మాల్యం నుంచి ఉరవకొండకు ఇసుక తరలిస్తూ 10 రోజుల క్రితం మూడు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. వీటికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేసి సీజ్ చేశారు. బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వేదావతి హగరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ ఇటీవల ఐదు ట్రాక్టర్లు పోలీసులకు చిక్కాయి. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసి సీజ్ చేశారు. గుమ్మఘట్ట పీఎస్ వద్ద కూడా రెండు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు ఉన్నాయి. ఇక.. డీ హీరేహాళ్ మండలం యాపిల్ ఫ్యాక్టరీ వెనుక సుమారు 50 ట్రిప్పులు, ఎస్సీ కాలనీ సమీపాన శ్మశాన దారిలో సుమారు 40 ట్రిప్పుల ఇసుక డంప్‌లు రెండు రోజుల క్రితం వెలుగుచూశాయి. ఇక్కడ ట్రాక్టర్ల ద్వారా పగలు డంప్ చేసి.. రాత్రిళ్లు టిప్పర్ల ద్వారా కర్ణాటకలోని బెంగళూరు, బళ్లారి తదితర ప్రాంతాలకు ఎత్తుకెళ్తున్నట్లు తెలిసింది. ఈ చీకటి కోణం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉన్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అడ్డుకుంటే బెదిరింపులు..

ఇటీవల హగరి ప్రాంతంలో రాత్రి పూట ఇసుక తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తుండగా ఆ గ్రామ సర్పంచ్ భర్త అడ్డుకున్నారు. ఈ వేళలో తవ్వకాలు జరపడం ఏంటని నిలదీశారు. ఈ క్రమంలో రెచ్చిపోయిన ఇసుకాసురులు సర్పంచ్ భర్తపై దౌర్జన్యానికి దిగారు. ఈ ట్రాక్టర్లు ఎవరివో తెలుసా..? రేపు వస్తాం..ఏం చేస్తావో చూస్తాం.. అంటూ ఎదురుదాడికి దిగారు. దీంతో ఆ నాయకుడు వెనుదిరగాల్సి వచ్చింది.

పోటీ పడి మరీ..

రాయదుర్గం పరిసరాల్లో లభించే ఇసుకకు కర్ణాటక రాష్ట్రంలో మంచి డిమాండ్ ఉంది. ట్రాక్టర్ ఇసుక రూ.6 వేల నుంచి రూ.7 వేలు, టిప్పర్ అయితే రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పలుకుతోంది. దీంతో టీడీపీ నాయకులు పోటీ పడి మరీ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం, బీటీపీ, గుమ్మఘట్ట, కలుగోడు, రంగచేడు, కణేకల్లు మండలంలోని రచ్చుమర్రి, కళేకుర్తి, నాగేపల్లి, మాల్యం, బొమ్మనహాళ్ మండలంలో ఉద్దేహాళ్, బండూరు, కల్లదేవనహళ్లి, బొల్లనగుడ్డం, డీ హీరేహాళ్ మండలంలో బాదనహాళ్, నాగలాపురం, హొసగుడ్డం బ్రిడ్జి, చెరువు ప్రాంతాల నుంచి నిత్యం వందల ట్రిప్పుల ఇసుక తరలిస్తున్నారు.

అక్రమాలను ఉపేక్షించేది లేదు

ఇసుకను అవసరాలకు కాకుండా అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుష్మిత, డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. డీ హీరేహాళ్ పరిధిలో వెలుగు చూసిన డంప్‌లపై విచారిస్తామన్నారు. రాత్రివేళ ఇసుక తరలిస్తే అదుపులోకి తీసుకునేలా పోలీసులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

లేపాక్షి నవోదయ ప్రవేశాలకు దరఖాస్తు

అనంతపురం ఎడ్యుకేషన్: లేపాక్షి నవోదయ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతుండాలని వెల్లడించారు. జిల్లాలో నివసిస్తున్న వారై ఉండాలని, 2013 మే 1 నుంచి 2015 జూలై 31లోపు పుట్టిన పిల్లలు అర్హులని పేర్కొన్నారు. సెప్టెంబరు 16లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు www.navodaya.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని పేర్కొన్నారు.

ఎంసీఏ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది జూలైలో నిర్వహించిన ఎంసీఏ రెండో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ మంగళవారం విడుదల చేశారు. ఫలితాల కోసం కళాశాల అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

- పాఠశాల విద్య ఆర్జేడీని కోరిన వైఎస్సార్‌టీఏ నాయకులు




ఆర్జేడీ శామ్యూల్‌కు బొకే అందజేస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు, వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆర్జేడీ శామ్యూల్‌కు వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు విన్నవించారు. ఆర్జేడీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారి జిల్లా పర్యటనకు వచ్చిన శామ్యూల్‌ను డీఈఓ కార్యాలయంలో కలసి బొకే అందజేశారు. విద్యారంగంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. ఆర్జేడీని కలిసిన వారిలో వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు రవీంద్రారెడ్డి, గోవిందరెడ్డి, వెంకటరమణ, వెంకటరెడ్డి, కృష్ణనాయక్, గోపాల్, రామకృష్ణ ఉన్నారు.

ప్రతి తరగతికీ ఓ టీచరును నియమించండి

ప్రతి తరగతికి ఓ ఉపాధ్యాయుడిని నియమించి విద్యార్థుల చదువుకు ఇబ్బంది కలగకుండా చూడాలని పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్‌కు యూటీఎఫ్ నాయకులు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం ఆర్జేడీని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య మాట్లాడుతూ... 117 జీఓ రద్దు చేసి 53 జీఓ ప్రకారం టీచర్లను నియమించాలని కోరారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఫ్రీ ప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులు ఒకే పాఠశాలగా ఉండేలా చూడాలన్నారు. అన్ని పాఠశాలల్లోనూ ఒకే రకమైన సిలబస్, ఒకే పరీక్ష విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. హై స్కూళ్లలో రెండు మీడియంలనూ సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కేటాయించరాదన్నారు. మినిమం టైం స్కేలు ఉపాధ్యాయుల సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలన్నారు. ప్లస్ టు పాఠశాలల్లో పీజీటీ పోస్టులకు రెగ్యులర్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఆర్జేడీని కలిసిన వారిలో యూటీఎఫ్ నాయకులు బీకే నారాయణ, మల్లికార్జున, పవన్‌కుమార్ ఉన్నారు.

ఎంఈఓ–2 జాబ్ చార్ట్‌ను సవరించాలి

మండల విద్యాశాఖ అధికారుల–2 జాబ్‌చార్ట్‌ను సవరించేలా చర్యలు తీసుకోవాలని ఆర్జేడీని ఎంఈఓ–2 అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్జేడీని కలసి వినతి పత్రం అందజేశారు. ఎంఈఓ–2 పేరును ఎంఈఓ అకాడమిక్‌గా మార్చడంతో పాటు సర్వీస్, ఇతర విషయాలను జిల్లా విద్యాశాఖ అధికారి పరిధిలోకి చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యకుడు గురు ప్రసాద్, రాష్ట్ర సలహాదారు డాక్టర్ రామచంద్ర, నాయకులు భవానీశంకర్, నారపరెడ్డి, లింగానాయక్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు జిల్లాస్థాయిలోనే జరగాలి

టీచర్ల సర్దుబాటు ప్రక్రియ జిల్లాస్థాయిలోనే జరగాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్‌ను కలిసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. ఆర్జేడీని కలిసిన వారిలో ఎస్టీయూ నాయకులు రమణారెడ్డి, రామాంజనేయులు, సూర్యుడు, ఫణిభూషణ్, సురేష్‌బాబు, కృష్ణమోహన్, కిషోర్, మురళీ, రాజన్న, రమేష్ ఉన్నారు.

ఆర్జేడీని కలిసిన ‘అపుస్మా’ నాయకులు

పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్‌ను ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నాయకులు మంగళవారం అనంతపురం నగరంలో కలిశారు. ఆర్జేడీ హోదాలో జిల్లాకు తొలిసారి రావడంతో శామ్యూల్‌ను కలిసి పూలబొకే అందజేసి, పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, ట్రెజరర్ ఇక్బాల్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, నాయకులు నాగరాజు, అది, శ్రీనివాసరెడ్డి, రవీంద్రరెడ్డి, శశిభూషణ్, లక్ష్మణ్, జలీల్, నారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, రామ్మూర్తి, మధుసూదన్‌రెడ్డి, రఘునాథరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి



మృతురాలు అక్కమ్మ

కూడేరు: మండలంలోని ఎంఎంహళ్లి బీసీ కాలనీలో విద్యుత్ షాక్‌కు గురై అక్కమ్మ(60) మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు .. మంగళవారం ఉదయం తన ఇంటి సమీపంలోనే ఉన్న దొడ్డిలోకి వెళ్లిన ఆమె అక్కడ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన స్టే తీగకు చెయ్యి తగిలించింది. అయితే అప్పటికే స్తంభానికి ఏర్పాటు చేసిన విద్యుత్ ఉపకరణాలు దెబ్బతిని స్టే తీగకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జీఓ 117 మేరకు టీచర్ల సర్దుబాటు తగదు

అనంతపురం ఎడ్యుకేషన్: జీఓ 117 ఆధారంగా టీచర్ల సర్దుబాటు చేస్తామంటూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గుజ్జల శివయ్య, ప్రధాన కార్యదర్శి డెగావత్ రవీంద్రనాథ్ తప్పుబట్టారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సర్దుబాటు ప్రక్రియపై ఓసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని మంత్రి నారా లోకేష్‌ను కోరారు. సర్దుబాటు అంశంపై ఇప్పటి వరకూ ఉపాధ్యాయ సంఘాలతో ఒక్కసారి కూడా సమావేశం ఏర్పాటు చేయకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సబబుకాదన్నారు. లోకేష్ తన యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వృద్ధుడి దుర్మరణం

అనంతపురం: నగరంలోని జనశక్తి నగర్‌లో కోత మిషన్ తెగి ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...ఉరవకొండలోని పాతపేటకు చెందిన దూదేకుల ఫకృద్దీన్ (63) కొన్నేళ్ల క్రితం అనంతపురానికి వలస వచ్చి జనశక్తినగర్‌లో వంట చెరుకు, కలప వ్యాపారంతో పాటు చెక్క సామగ్రి తయారీ పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కలపను కోత మిషన్‌తో కత్తరిస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్‌కు ఉన్న బ్లేడ్ తెగి కాళ్లను బలంగా తాకాయి. దీంతో కాళ్లు తెగి పడ్డాయి. గమనించిన స్థానికులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రియురాలిపై హత్యాయత్నం

- పెట్రోల్ పోసి నిప్పంటించిన ప్రియుడు

రాయదుర్గం టౌన్: వివాహేతర సంబంధం తెచ్చిన తంటా ఆ ఇద్దరి మధ్య విభేదాలకు దారి తీసింది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు పెట్రోల్ పోసుకుని నిప్పు పెట్టుకునే స్థాయికి చేరుకున్నారు. నెల రోజుల క్రితం ప్రియురాలు హత్యాయత్నం చేయగా... తాజాగా ఆమెపై ప్రియుడు పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. ఘటనలో దాదాపు 60 శాతానికి పైగా కాలిన గాయాలతో క్షతగాత్రురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలు.... రాయదుర్గంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో నివాసముంటున్న 40 ఏళ్ల వయసున్న పార్వతి భర్తను విడిచి తన కుమార్తెతో కలసి జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో అదే కాలనీలో నివాసముంటున్న తాపీ మేస్త్రీ మోహన్‌తో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలుసుకున్న మోహన్ భార్య ఆయనను నిలదీసింది. కుటుంబంలో గొడవలు మొదలవడంతో పార్వతిని మోహన్ దూరంగా పెడుతూ వచ్చాడు. దీంతో ఆసహనానికి గురైన పార్వతి గత మే 12న ఇంటికి వెళుతున్న మోహన్‌పై పెట్రోల్ పోసి నిప్పు పెట్టే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో ప్రమాదం నుంచి తప్పించుకున్న మోహన్... పార్వతిపై కక్ష పెంచుకున్నాడు. ఆమె బతికి ఉంటే ఎప్పటికైనా తన ప్రాణాలకు ముప్పు తప్పదని భావించిన ఆయన మంగళవారం సాయంత్రం పొదుపు సంఘం సమావేశానికి వెళుతున్న పార్వతిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పి ఆమెను ఆస్పత్రికి చేర్చారు. అప్పటికే 60 శాతం కాలిన గాయాలతో బాధపడుతున్న ఆమెకు ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. సమాచారం అందుకున్న రాయదుర్గం సీఐ శ్రీనివాసులు ఆస్పత్రికి చేరుకుని బాధితురాలితో ఫిర్యాదు స్వీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

చిరుద్యోగుల బలవంతపు తొలగింపులు ఆపండి

- వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ

రాప్తాడు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కక్ష కట్టి చిరుద్యోగులతో బలవంతపు రాజీనామాలు చేయిస్తోందని, ఈ చర్యలను వెంటనే ఆపాలని వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐకేపీ, వీఓఏ, మధ్యాహ్న భోజన పథకం, పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, స్టోర్ డీలర్లపై సాగిస్తున్న దౌర్జన్యాలను తక్షణమే ఆపి, వారి ఉద్యోగాలకు భద్రత కల్పించాలన్నారు. చిరు ఉద్యోగులు అడగకుండానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీతాలు రెట్టింపు చేసి వారు గౌరవంగా జీవించేలా చర్యలు తీసుకుందన్నారు. ఉద్యోగాలను తొలగించడమే కాకుండా భౌతిక దాడులు, మహిళా ఉద్యోగులపై అత్యాచారాలు, అవమానాలకు పూనుకోవడం సిగ్గుచేటన్నారు. వీరితో పాటు స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్ – ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా భయంభయంగా బతికే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 2,600 మంది ఆరోగ్య మిత్రులు ఇతర సేవలను చేస్తున్న వారిని తొలగించడానికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని, ఇలాంటి చర్యలను ప్రజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో ఖండించి బాధితులకు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు రైతుల ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక వారు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు...

రాయదుర్గం: మండలంలోని టి.వీరాపురం గ్రామానికి చెందిన ఓబన్న (42)కు తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకుని కొంత కాలంగా వివిధ రకాల పంటలు సాగు చేస్తూ వచ్చారు. అయితే చీడపీడలతో పాటు, సరైన దిగుబడులు లేక నష్టాలపాలయ్యాడు. పంటల సాగుకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి రూ.15 లక్షలకు చేరుకుంది. ఇటీవల వడ్డీ వ్యాపారులు తమ అప్పు తీర్చాలంటూ ఒత్తిళ్లు తీవ్రం చేయడంతో మనస్తాపం చెందిన ఆయన మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై రాయదుర్గం సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఓబన్నకు భార్య ఈరమ్మ, ఓ కుమారుడు ఉన్నారు.

కంబదూరు: మండలంలోని రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన దండా వెంకటస్వామి, ప్రమీలమ్మ దంపతుల రెండో కుమారుడు సూరి (29)కి ఐదు ఎకరాల పొలం ఉంది. కొన్నేళ్లుగా వివిధ రకాల పంటల సాగుతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పంట పెట్టుబడులకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి రూ.8 లక్షలకు చేరుకుంది. ఈ మొత్తాన్ని ఎలా తీర్చాలో తెలియక మదన పడుతున్న ఆయన జీవితంపై విరక్తితో మంగళవారం పొలంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, సూరికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కుష్టు వ్యాధిపై ఆందోళన వీడండి

- జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ దేవసాగర్

అనంతపురం మెడికల్: కుష్టు వ్యాధిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే ఏ దశలోనైనా నయం చేయవచ్చునని కుష్టు వ్యాధి నివారణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ అన్నారు. మంగళవారం ఆయన అనంతపురంలో పర్యటించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం, సర్వజనాస్పత్రిలోని డర్మటాలజీ ఓపీను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవితో కలసి ఆయన మాట్లాడుతూ... గత నెల 18 నుంచి ఈ నెల 10వ తేదీ వరకూ కుష్టు వ్యాధి స్క్రీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు గుర్తు చేశారు. ప్రతి ఇంటినీ ఏఎన్ఎం, వలంటీర్లు సందర్శించి చర్మంపై స్పర్శ, నొప్పి లేని, దురదలేని మచ్చలు, ఎర్రని, రాగి రంగు మచ్చలు, చేతులు పాదాలు తిమ్మర్లు రావడం, కనుబొమ్మల, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం తదితర సమస్యలున్న వారిని గుర్తిస్తున్నారన్నారు. కుష్టు వ్యాధి గ్రస్తులకు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట డాక్టర్ గంగాధర్, పీఎంఓ నాగన్న, హెచ్ఈఓ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎల్‌సీడీసీ సర్వే

పెద్దవడుగూరు: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన ఎల్‌సీడీసీ సర్వే పక్కాగా జరగాలని సంబంధిత సిబ్బందిని లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ సూచించారు. మంగళవారం పెద్దవడుగూరులోని పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. కుష్టు రోగులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందితో ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసబాబు, జిల్లా న్యూక్లియస్ లెప్రసీ మెడికల్ ఆఫీసర్ గంగాధర్ రెడ్డి, పీఎంఓ నాగన్న, హెచ్ఈఓ సత్యనారాయణ, డీపీఎంఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా - ఒకరి మృతి



మృతుడు సూర్యనారాయణరెడ్డి

పెద్దవడుగూరు: బండల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం రాఘవరాజుపల్లికి చెందిన అంబటి పెద్ద సూర్యనారాయణరెడ్డి (70) సోమవారం రాత్రి బెలూమ్ వద్ద నుంచి నల్లబండలను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని ఉరవకొండకు ప్రయాణమయ్యాడు. మార్గం మధ్యలో పెద్దవడుగూరు సమీపంలోకి చేరుకోగానే రోడ్డుపై గుంతలను తప్పించే క్రమంలో అదుపు తప్పి పక్కనున్న పల్లంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో డ్రైవర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, కూలీలు శివశంకరరెడ్డి, మూరబోయిన మద్దిలేటికి గాయాలయ్యాయి. డ్రైవర్ పక్కనే కూర్చొని ఉన్న సూర్యనారాయణరెడ్డి బండల మధ్య చిక్కుకుని మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో సూర్యనారాయణరెడ్డి మృతదేహాన్ని వెలికి తీశారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా పామిడిలోని సీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు.

ఉద్యాన పథకాలకు రూ.6.91 కోట్లు

- ఉద్యానశాఖ జిల్లా అధికారి జీఎంవీ నరసింహారావు వెల్లడి

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది ఉద్యానశాఖ ద్వారా రూ.6.91 కోట్ల బడ్జెట్‌తో పథకాలు అమలు చేయనున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి బీఎంవీ నరసింహారావు తెలిపారు. మంగళవారం స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం 1.28 లక్షల హెక్టార్లలో ఉద్యాన తోటలు విస్తరించి ఉన్నాయన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను కమిషనరేట్ నుంచి అందిన కార్యాచరణకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆమోదముద్ర వేశారన్నారు. దీంతో ఉద్యాన సమగ్ర అభివృద్ధి పథకం (ఎంఐడీహెచ్), ఆయిల్‌ఫాం కింద రూ.5.76 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస యోజనా (ఆర్‌కేవీవై) కింద రూ.1.15 కోట్లు... మొత్తంగా రూ.6.91 కోట్లు బడ్జెట్ కేటాయించారని తెలిపారు. అవసరమైతే అదనపు కేటాయింపులకు కూడా అనుమతి ఇచ్చారన్నారు. ప్రధానంగా ఈ సారి కొత్తగా 300 హెక్టార్లలో ఆయిల్‌ఫాం (పామాయిల్) తోటల పెంపకానికి కూడేరు, ఉరవకొండ, వజ్రకరూరు, కణకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాలను ఎంపిక చేశామన్నారు. ఒక్కో రైతు 25 హెక్టార్ల వరకు పామాయిల్ తోటలు సాగు చేసుకోవచ్చన్నారు. మామిడి, మాజ, చీనీ, దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్, అంజూర, నేరేడు తదితర పంటలు సాగు చేసే రైతులకు మొక్కల ఖర్చు, ఎరువులు, పురుగు మందుల ఖరీదులో 40 శాతం, పూలతోటలు పెంచే రైతులకు హెక్టారుకు రూ.16 వేలు రాయితీ ఇస్తామన్నారు. ఉద్యాన పథకాలు, రాయితీలపై రైతులు ఎక్కడికక్కడ ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు, హెచ్ఓలను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జంప్ రోప్ క్రీడాకారుడికి ఘనస్వాగతం



విద్యార్థి సంతోష్ నాయక్‌ను అభినందిస్తున్న ప్రిన్స్‌పాల్ ఫయాజ్, ఉపాధ్యాయులు

గుత్తి రూరల్: జపాన్‌లోని కవాసకిలో జరిగిన ఆసియా జంప్‌రోప్ చాంపియన్‌షిప్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన సేవాగఢ్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి వి.సంతోష్‌నాయక్‌కు ఘన స్వాగతం లభించింది. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం ఒడ్డుకింద తండా గ్రామానికి చెందిన రెడ్డప్పనాయక్, రత్నబాయి దంపతుల కుమారుడు వి.సంతోష్ నాయక్... గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. పీఈటీ, కోచ్ విజయకుమార్ నాయక్ నేతృత్వంలో జంప్ రోప్ క్రీడపై సాధన చేసిన విద్యార్థి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూలై 24 నుంచి 29 వరకూ జపాన్‌లోని కవాసకిలో జరిగిన జంప్ రోప్ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. వ్యక్తి విభాగంలో 12 దేశాల క్రీడాకారులతో తలపడిన సంతోష్‌నాయక్ ఉత్తమ ప్రతిభతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. మంగళవారం సేవాగఢ్‌కు వచ్చిన సంతోష్‌నాయక్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి మేళతాళాలు, తప్పెట్లతో ఊరేగించారు. పాఠశాల ప్రిన్స్‌పాల్ ఫయాజ్, పీఈటీ విజయ్‌కుమార్‌నాయక్ అభినందించారు.

ఆశా కార్యకర్త అనుమానాస్పద మృతి



నాగజ్యోతి (ఫైల్)

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ పరిధిలోని పాపంపేట 5వ సచివాలయంలో ఆశా కార్యకర్తగా పని చేస్తున్న మీనుగ నాగజ్యోతి (33) మంగళవారం సాయంత్రం అనుమానాస్పదంగా మృతి చెందింది. బంధువులు, స్థానికులు తెలిపిన మేరకు...విద్యారణ్యనగర్‌కు చెందిన నాగజ్యోతికి 16 ఏళ్ల క్రితం ఉరవకొండ మండలం మైలారంపల్లికి చెందిన అంకే ఆంజనేయులుతో వివాహమైంది. పెళ్లైన కొన్ని రోజులకే అనంతపురానికి కాపురం మార్చారు. వీరు ప్రస్తుతం కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలోని సీఎస్ పురంలో ఉంటున్నారు. ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా ఆంజనేయులు, ఆశ వర్కర్‌గా నాగజ్యోతి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి ఇద్దరు కుమారుల్లో ఒకరు 9, మరొకరు 5వ తరగతి చదువుతున్నారు.

సాయంత్రం దంపతుల మధ్య గొడవ

ఆంజనేయులు కొన్ని రోజులుగా కొందరు మహిళలతో వివాహేతర సంబంధాలు కొనసాగిస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. తన జల్సాలకు భార్య అడ్డు తగులుతోందన్న అక్కసుతో ఆమెపై వేధింపులకు పాల్పడేవాడు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో గతంలో ఓసారి ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. సకాలంలో నాగజ్యోతి కుటుంబసభ్యులు స్పందించడంతో అప్పట్లో ప్రాణాపాయం నుంచి బయటపడింది. అదే సమయంలో ఇరు వైపులా పెద్దలు కలసి దంపతుల మధ్య రాజీ చేశారు. తన భార్యను సక్రమంగా చూసుకుంటానని నాడు పెద్దల పంచాయితీలో భరోసా ఇచ్చిన ఆంజనేయులు... ఆ తర్వాత తన తీరును మార్చుకోకుండా నాగజ్యోతిని మానసికంగా ఇబ్బంది పెడుతూ వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం భార్యతో మరోమారు గొడవపడ్డాడు. ఆత్మాభిమానం దెబ్బతినేలా మాట్లాడాడు. అనంతరం ఏమి జరిగిందో.. తెలియదు కానీ ఇంట్లో ఫ్యాన్‌కు వేసిన ఉరికి నాగజ్యోతి విగతజీవిగా వేలాడుతూ కనిపించింది. గమనించిన ఆమె కుటుంబ సభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. భర్తే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో నాగజ్యోతి మృతిపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఐఎస్ఓ ప్రమాణాల మేరకే కలెక్టరేట్‌లో మార్పులు



మాట్లాడుతున్న ఐఎస్ఓ లీడ్ ఆడిటర్ ప్రసాద్, చిత్రంలో డీఆర్వో రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: ఐఎస్ఓ ప్రమాణాలకు అనుగుణంగా కలెక్టరేట్‌లో సమూల మార్పు చేపట్టనున్నట్లు ఐఎస్ఓ బృందానికి డీఆర్వో జి.రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. గ్లోబల్ మేనేజ్మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ సంస్థకు చెందిన లీడ్ ఆడిటర్ కె.ఎస్.ఎస్. ప్రసాద్, ఆడిటర్ రాజేష్, కో-ఆడిటర్ సింగయ్య మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్వోతో కలసి కలెక్టరేట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ ఆడిటర్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వ కార్యాలయమైనా ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్ పొందాలంటే పాటించాల్సిన 39 రకాల ప్రమాణాలపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టరేట్‌లోని విభాగాలను పరిశీలించి తగిన సూచనలిచ్చారు. ప్రమాణాలకు అనుగుణంగా మార్పులు, చేర్పుల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వారికి డీఆర్వో తెలిపారు.

క్లుప్తంగా

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్‌నాయుడు

చెన్నేకొత్తపల్లి: క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రం సమీపంలోని ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే ఎస్‌ఎంసీ ఎన్నికకు సంబంధించిన ఓటర్ల జాబితాను పరిశీలించారు. వివరాలను అక్కడి ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. రోజూ భోజనం రుచిగా ఉంటుందా, కడుపు నిండా పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

సూక్ష్మ సేద్య పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

చెన్నేకొత్తపల్లి: మండలంలో అర్హులైన రైతులు 2024-25కు సంబంధించి సూక్ష్మ సేద్య(బిందు, తుంపర) పరికరాల కోసం పేర్లను నమోదు చేయించుకోవాలని ఎంఐఏఓ రవిశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. బోరు బావుల కింద పంటలు సాగు చేసే రైతులు రైతులు 1బీ, ఎఫ్‌ఎంబీ స్కెచ్, చెక్‌బంద్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్‌బుక్కు జిరాక్స్, బోరుబావి కరెంటు బిల్లు, తదితర డాక్యుమెంట్లతో రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 79950 10085, 9704439518 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి



కుమ్మర ఆంజనేయులు (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మేడాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కుమ్మర ఆంజనేయులు (58) సోమవారం రాత్రి మృతి అనారోగ్యంతో చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అనారోగ్యంతో బాధపడుతున్న ఆంజనేయులును మూడు రోజుల క్రితం అనంతపురంలో వైద్యం చేయించారు. తర్వాత ఇంటికి వచ్చారు. ఒక్కసారిగా పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య ఆదిలక్ష్మి, కుమారుడు ఓబుళపతి ఉన్నారు. ఆంజనేయులు వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పని చేసేవాడని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు.

పరమట వీరన్నస్వామి ఆలయానికి హద్దులు చూపండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అయ్యవారిపల్లి గ్రామస్తులు

రాప్తాడు: అయ్యవారిపల్లి గ్రామ సమీపంలో వెలసిన పరమట వీరన్నస్వామి ఆలయ స్థలానికి హద్దులు చూపాలని అయ్యవారిపల్లి గ్రామస్తులు తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాప్తాడు పొలం సర్వే నెంబర్ 337-2లో పడమట వీరన్న స్వామి ఆలయానికి సంబంధించి 17 సెంట్ల స్థలం ఉందని, ఆ భూమికి సంబంధించి హద్దులు ఏర్పాటు చేసి సర్వే చేపించాలని వారు కోరారు. గ్రామస్తులు మురళి, శేఖర్, ఆదినారాయణ, రాజశేఖర్, ఈశ్వరయ్య, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, కరెంట్ గోపాల్, తేజ, నాగరాజు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థినికి టీసీఎస్‌లో ఉద్యోగం



నస్రీన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డి

అనంతపురం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురంలో డిప్లొమో ఈసీఈ విద్యార్థిని ఎస్. నస్రీన్ టీసీఎస్ కంపెనీలో కొలువు దక్కించుకుంది. ప్రస్తుత ట్రైనింగ్‌లోనే ఏడాదికి రూ.2 లక్షల ప్యాకేజీ ఇవ్వనున్నారు. అనంతరం ప్యాకేజీ పెంచనున్నారు. టీసీఎస్‌లో కొలువు దక్కించుకున్న సందర్భంగా ప్రిన్సిపాల్ సి. జయచంద్రారెడ్డి , ఈసీఈ విభాగాధిపతి జి. సుధాకర్‌రెడ్డి, బి. కరుణ కుమార్ విద్యార్థినిని అభినందించారు. ఎస్ .నస్రీన్ తండ్రి చాంద్ బాషా ధర్మవరంలో చేనేత కార్మికుడు. డిప్లొమోతోనే మంచి కంపెనీలో కొలువు దక్కించుకోవడం గర్వకారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

తల్లిపాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి



ఆత్మకూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న ఐసీడీఎస్, వైద్య సిబ్బంది



ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ నుంచి ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



అనంతపురంలో ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలు పట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీను ఆమె ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... తల్లిపాల ప్రాముఖతను వివరించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలను చైతన్య పరచాలని క్షేత్రస్థాయి ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులకు సూచించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

ఆత్మకూరు: తల్లిపాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, శ్రీవాణి తెలియజేశారు. మంగళవారం ఆత్మకూరులో తల్లిపాల వారోత్సవాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సబిహా సుల్తానా తల్లి పాలతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. తల్లిపాల వారోత్సవాల పోస్టర్లువిడుదల చేశారు.

చెన్నేకొత్తపల్లి: చంటి బిడ్డలకు తల్లిపాలను ఇవ్వడం ద్వారా వారిలో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రవినాయక్ అన్నారు. మంగళవారం ఎన్ఎస్‌గేట్‌లోని పీహెచ్‌సీ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్లు వెంకటనారాయణ ,రామలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చెన్నేకొత్తపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సీడీపీఓ కవితాదేవి తల్లిపాల ప్రాముఖ్యతను తల్లులకు వివరించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు: శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డతో పాటు తల్లికి ఆరోగ్య రక్షణ ఉంటుందని వైద్యాధికారి శివ కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో తల్లిపాల వారోత్సవాలు, నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపు తల్లిపాలు పట్టాలని, తద్వారా బిడ్డలకు మంచి ఆరోగ్య రక్షణ ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం సవీరా కాలేజీ, నిర్మల కాలేజీ నర్సింగ్ విద్యార్థులు కూడా తల్లిపాలు, నులి పురుగుల గురించి వివరించారు. సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్స్ అరుణ, నరసింహ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు, ఫార్మసీ ఆఫీసర్ మూర్తి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం ఏ. నారాయణపురం -1, భగత్‌సింగ్‌నగర్, విద్యారణ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ జయశ్రీ బాలింతలు, గర్భిణులకు తల్లి పాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సిబ్బంది కౌసర్‌బాను, సబీరాబేగం, రమణమ్మ, గంగాదేవి, షాను, మాధవి, చంద్రకళ ఉన్నారు.

తాగునీటి సమస్య రానివ్వం

- మేయర్ వసీం



గుల్జార్‌పేటలో స్థానికులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగర ప్రజలకు తాగునీటి సమస్య రానివ్వకుండా ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం గుల్జార్‌పేటలో తాగునీరు వృథా అవుతున్నట్లు స్థానికుల నుంచి మేయర్‌కు ఫిర్యాదు అందింది. స్పందించిన మేయర్ గుల్జార్‌పేటలో పర్యటించారు. నీటి సమస్య రానివ్వకుండా ఎప్పటికప్పుడు పాలకవర్గం చర్యలు తీసుకుంటోందన్నారు. రెండ్రోజుల క్రితం పీఏబీఆర్‌లో మోటర్లు రిపేరీ కావడంతో వాటికి పరిష్కారం చూపి, నగర ప్రజలకు నీరందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజాసమస్యలు తీవ్రతరం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో డక్టైల్ ఐరన్(డీఐ) పైపుల ద్వారా ఇంటింటికి తాగునీరు సరఫరా చేయడానికి ట్రయల్ రన్ ద్వారా చివర్లో ఉన్నటువంటి ఇళ్లకు కూడా నీరు వెళ్తుందా లేదా అని పరిశీలించడానికి డీఐ పైపులను బయట ఉంచి నీటిని వదిలారన్నారు. ట్రయల్ రన్ పూర్తయిన తర్వాత నీరు ఎక్కడ వృథా కాదన్నారు. ట్రయల్ రన్ తర్వాత నీటి కొళాయిని ఇంటి లోపల ఏర్పాటు చేస్తారన్నారు. అదేవిధంగా నగరంలోని 39వ డివిజన్ వడ్డే వారి కాలనీలో రోడ్డు సక్రమంగా లేదని ప్రజలు తెలియజేయడంతో అక్కడికెళ్లి పరిశీలించారు. సీసీరోడ్డు నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో ఏ తరహా సమస్య ఉన్నా కింద తెల్పిన 7075414888(వాట్సాప్) నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మేయర్ వెంట ఈఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్, ఏఈ బాబావలి, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దాదు, చింతకుంట మధు తదితరులు ఉన్నారు.

అంతా నా ఇష్టం..!

- ఎంపీడీఓ కార్యాలయంలో ఓ అధికారి ఏకపక్ష వైఖరి
- అలవెన్స్, ఇతరత్రా బిల్లుల పెండింగ్
- తొమ్మిది నెలలుగా స్వీపర్‌కు అందని జీతం

ఆత్మకూరు: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే పాలన ముందుకు సాగేది. కాదని ఏ ఒక్కరూ నియంత్రత్వంగా వ్యవహరించినా పాలన గాడి తప్పడమేగాక ఇతరులకు ఇక్కట్లు తప్పవు. వివరాల్లోకి వెళితే... ఎంపీడీఓ కార్యాలయంలో మాత్రం ఓ అధికారి ఏకపక్ష వైఖరి అవలంబిస్తున్నారు. గతంలో కొద్ది రోజులు ఎంపీడీఓ సెలవులపై వెళ్తే ఆ అధికారికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించేవారు. దీంతో కార్యాలయంలో ఆయన చెప్పిందే వేదం.. అంతా ఆయన ఇష్టం అన్నట్లు వ్యవహరించేవారు. ప్రస్తుతం ఎంపీడీఓ ఉన్నప్పటికీ కార్యాలయన్నంతా తన గుప్పిట్లో పెట్టుకొని పెత్తనం చలాయిస్తున్నారు. కార్యాలయాలకు సంబంధించి చేసిన పనులకు ఏ బిల్లులు అందించాలన్నా నెలలు గడవాల్సిందే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

బిల్లులు అందక ఇబ్బందులు

మండలంలోని 11 మంది ఎంపీటీసీలకు సంబంధించి వేతనాలు అందలేదని వారు వాపోతున్నారు. పక్క మండలాల్లో తమకు మూడు నెలల కిందనే అందించారని, ఇక్కడ మాత్రం ఆరు నెలలైనా ఇవ్వడం లేదని వారు పేర్కొంటున్నారు. వేతనాల బిల్లులు పెట్టమని అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. అంతేకాకుండా సర్వసభ్య సమావేశాల భోజనం, అలవెన్స్ బిల్లులు పెట్టడం లేదని చెబుతున్నారు. దీనిపై సదరు అధికారిని అడిగితే ఇదిగో పెడతాం..అదిగో పెడతాం అంటూ కాలయాపన చేస్తున్నారని గుర్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎంపీడీఓ కార్యాలయంలో ఓ వృద్ధురాలు స్వీపర్‌గా పని చేస్తోంది. ఆమెకు నెలకు రూ.3 వేలు వేతనం కాగా దాదాపు 9 నెలల నుంచి వేతనం బిల్లు పెట్టడం లేదని సమాచారం. దీనిపై ఎంపీడీఓ దశరథరామయ్యను సంప్రదించగా స్వీపర్ వేతనంతోపాటు ఎంపీటీసీల వేతనం, అలవెన్స్ బిల్లులు పెట్టమని చెప్పామని తెలియజేశారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కిసాన్ మోర్చా నాయకులు

అనంతపురం అర్బన్: జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు తెగదొడ్డి తిమ్మారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట కిసాన్ మోర్చా నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తిమ్మారెడ్డి మాట్లాడుతూ గతేడాది తీవ్ర వర్షాభావం కారణంగా పంటలు పండక రైతులు నష్టపోయారన్నారు. ఈ ఏడాది కూడా వర్షాభావం జిల్లాలో కరువు ఛాయలు అలుముకున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పంటల బీమా విషయంలో సరైన విధానాలను రూపకల్పనకు నూతన ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ జి.రామకృష్ణారెడ్డికి నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు అమరేశ్, బాల కంబగిరి, కాటమయ్య, శివయ్య, సంజీవ, వెంకప్ప, సుంకిరెడ్డి, గంగాధర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని జయంతి వేడుకలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకునే సత్యనారాయణ స్వామి జయంతి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని అశోక్‌నగర్‌లో వెలసిన రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, మూలవిరాట్‌కు సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం ఘనంగా జరిగాయి. ఆరుబయట వేసిన పందిరిలో భక్తులు సత్యనారాయణస్వామి అష్టాక్షరి హోమం, కంకణధారణ, 108 ప్రదక్షిణాలు చేశారు. మధ్యాహ్నం శ్రీవారి రథోత్సవం కంకణ విసర్జన జరిగాయి. ఈ సందర్భంగా కమనీయంగా సాగిన కల్యాణోత్సవంలో వందలాది మంది పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఫణిరాజ్, తిరువీధుల జగదీష్, వెంకట కృష్ణారెడ్డి, వసంత కుమార్ జైన్ తదితరులు భక్తులందరికి మహా ప్రసాద వితరణ చేశారు.

అన్నా క్యాంటీన్ల పనులు నాణ్యతతో చేపట్టాలి



అన్నా క్యాంటీన్ పనులపై సిబ్బందికి సూచనలిస్తున్న మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి

అనంతపురం కార్పొరేషన్: అన్నా క్యాంటీన్లలో జరుగుతున్న పునరుద్ధరణ పనులను నాణ్యతతో చేపట్టాలని మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మునిసిపల్ ఆర్‌డీ, కమిషనర్ పీవీవీఎస్ మూర్తి నగరంలో పర్యటించారు. నిర్దేశిత సమయంలో పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చెరువుకట్ట వద్ద ఎన్‌టీఆర్ పార్క్‌లో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలించి, త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావడానికి చేయాల్సిన పనులను తెలిపారు. రోజూ సంబంధిత సిబ్బంది నిర్దిష్ట సమయంలో విధులకు హాజరై పారిశుధ్య పనులను మెరుగ్గా చేపట్టేలా చూడాలన్నారు. ప్రతి ఇంటి వద్ద చెత్త సేకరణ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికను తొలగించేలా చూడాలన్నారు. నగరంలో భవన నిర్మాణ వ్యర్థాలు, అనధికారి ఫ్లెక్సీలను ఎప్పటికప్పుడు తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

పంటల యాజమాన్యంపై పరిజ్ఞానం తప్పనిసరి



శిక్షణ ఇస్తున్న ఏడీఏ ఎం.రవి, వేదికపై డీఏఓ, శాస్త్రవేత్తలు, డీడీఏ తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై ఎప్పటికప్పుడు పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక రైతుశిక్షణ కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దిలేటి అధ్యక్షతన ఏడీఏ, ఏఓ, అలాగే రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) అసిస్టెంట్లకు సామర్థ్య పెంపు (కెపాసిటీ బిల్డింగ్)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ, డీడీఏతో పాటు ఏడీఏ ఎం .రవి, శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ కిశోర్ రెడ్డి, డాక్టర్ రమేష్‌నాయక్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలతో పాటు పప్పుధాన్యాలు, చిరుధాన్యపు పంటల ప్రాముఖ్యత, సాగు విధానం, చీడపీడల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఆర్‌ఎస్‌కే పరిధిలో రైతులు దేనికీ ఇబ్బంది పడకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా తెగుళ్లు, పురుగులు, చీడపీడల ఖర్చు బాగా పెరుగుతున్నందున ముందస్తుగా గుర్తించి నివారణపై దృష్టి పెట్టాలని సూచించారు. వర్షాభావంతో ఖరీఫ్ అంతంత మాత్రంగానే ఉండటం, ఇక నుంచి ప్రత్యామ్నాయంపై దృష్టి సారించి రైతులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ-క్రాప్ పక్రియ పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు.

దళితులపై దాడులు అరికట్టాలి

అనంతపురం టవర్‌క్లాక్: దళితులపై దాడులను అరికట్టాలని మాల మహానాడు ఐక్యవేదిక అధ్యక్షుడు గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చుండూరు మారణహోమానికి నిరసనగా మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగాధర్ మాట్లాడుతూ 1991లో చుండూరులో దళితులను ఊచ కోత కోసి మృతదేహాలు కనిపించకుండా చేసిన అగ్రకులాల వారికి నేటికీ సరైన శిక్ష పడలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. నాయకులు సాకే హరి, ఓబులేసు, శ్రీనివాసులు, నరేష్, ఓబుళరాజు, రామాంజనేయులు, విజయ్, ఈశ్వరయ్య, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం: పోలీసు అధికారులు జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ, నూతన చట్టాలపై అవగాహన సదస్సులు చేపట్టారు. రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, తదితర మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం, నాటు సారా, తదితర అక్రమ రవాణా జరగకుండా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అంతే కాకుండా.. ఈ ఏడాది జూలై నుంచి అమల్లోకి వచ్చిన నూతన చట్టాలపై సదస్సులు ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

గుమ్మఘట్ట: అనుమతి లేకుండా కర్ణాటకకు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రం సమీపంలోని వేదావతి హగరి నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా అర్ధరాత్రి సమయంలో కర్ణాటకకు ఇసుకను తరలిస్తుండగా కేపీకుంట వద్ద పట్టుకొని, వాటి యజమానులు టీడీపీ నాయకులు పూజారి శివ,పోతులరాజు శివకుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ

అనంతపురం: ప్రతి ఒక్కరూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ పేర్కొన్నారు. రామకృష్ణ మఠం అనంతపురం శాఖ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని యువ జాగృతి సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వామి వివేకానంద సూక్తులను అమృత వాక్యాలుగా తీసుకుంటూ ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానంలో ఉండాలన్నారు. రామకృష్ణ మఠం వారు ప్రతి నిత్యం యువతకు జాగృతం చేయడం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామన్నారు. ఈసందర్భంగా వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కలెక్టరేట్ ఏఓకు సన్మానం



పరిపాలనాధికారి మారుతీని సన్మానిస్తున్న సచివాలయ సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారిగా బాధ్యతలు స్వీకరించిన జి.మారుతీని గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు సన్మానించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మారుతీని సంఘం నాయకులు కలిసి శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మారుతీ మాట్లాడుతూ సచివాలయ సేవలు ప్రజలకు సత్వరం అందేలా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు ఎంకే వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి వి.లక్ష్మీనారాయణ, జిల్లా సహాధ్యక్షుడు శివశంకర్, ప్రధాన కార్యదర్శి హనుమంత్, నాయకులు మహేష్, రామాంజనేయులు, చిరంజీవి, రవికుమార్, భగీరథరెడ్డి, శివశంకర్, రామకృష్ణ, నారాయణస్వామి, అశ్వత్థరెడ్డి, రాఘవేంద్ర ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ



పూజలందుకున్న ఆంజనేయుడు

అనంతపురం కల్చరల్: శ్రావణ మాసం రాకతో ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. హనుమంతునికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయంలో ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, అలంకార సేవలు జరిగాయి. సామూహిక హనుమాన్ చాలీసా పఠనం జరిగింది. హనుమంతుని నామస్మరణతో ఆలయం మార్మోగింది. కోర్టు రోడ్డు అభయాంజనేయస్వామి ఆలయం, మారుతీ నగర్‌లోని రామాలయంలో తొలి శ్రావణ మంగళవారం పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

పంపనూరులో..

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రంలో శ్రావణ మాస ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించి, వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8వ తేది నుంచి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి తెలిపారు. ఈ నెల 10న కల్యాణోత్సవం ఉంటుందన్నారు. 25న అన్నాభిషేకం, సెప్టెంబర్ 1న సర్ప సూక్త హరిద్రాభిషేకం, అశ్లేషాబలి కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కాగా, శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి విక్రయ హక్కులకు బుధవారం వేలం పాట నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న వారు బుధవారం ఉదయం 10 గంటల్లోపు ఆలయంలో ఉండాలని ఈఓ సూచించారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం: జానకిరామ్ నగర్‌లో కడుపు నొప్పి తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. త్రీ టౌన్ సీఐ ధరణీకిశోర్ తెలిపిన మేరకు.. జానకిరామ్‌నగర్‌కు చెందిన తోట బాలకృష్ణ భార్య అనంత ఇంద్రజ(28) కడుపునొప్పితో బాధపడేది. నొప్పి తాళలేక మంగళవారం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు. మృతురాలి తల్లి సుశీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు



రక్తదాతలను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు తదితరులు

అనంతపురం: రక్తదాతలే ప్రాణదాతలు అని జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం, ప్రభుత్వ సర్వజనాసుపత్రి రక్తనిధి సంయుక్తంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం ఎవరికి అవసరం ఉన్నా వెంటనే స్పందించాలన్నారు. స్వచ్ఛందంగా రక్తం ఇస్తే అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణక్రాంతి, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ జి. మమత, రాయలసీమ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఏ. ఆనందరావు, డాక్టర్ ఎం. రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.